# ప్రేమకానుక

## —పెద్దూరి వెంకటదాసు

సాయంత్రం గం. 6.30 నిమిషాలు.

రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించబడిన రవీంద్రభారతి ఆడిటోరియం మొగ్గ పువ్వుగా విచ్చుకుంటున్న చందాన శ్రావణసంధ్య చిరుజల్లులతో స్వాగతం పలుకుతుంటే, ఆరసానుభూతిని కొందరు తమ పిల్లపాపలతో ఆస్వాదిస్తున్నారు. అప్పటికే క్రిక్కిరిసిన జనంతో నిండిన హాలులో వీడియో కెమెరా వి.ఐ.పి. ఎంట్రెన్స్ వైపు ఫోకస్ చేసినప్పుడల్లా ఊపిరిబిగపట్టి చూస్తున్నారు జనం తమ అభిమాన వ్యక్తి ఆగమనం కోసం. అప్పటికే రావలసిన వి.ఐ. పి.లంతా విచ్చేశారు. నాటి కార్యక్రమ కథానాయకుడు రావడమే తరువాయి. ఆ నిశ్శబ్దాన్ని భగ్నంచేస్తూ అనౌన్సర్ ప్రకటన కూడా వెలువడింది. "మీరంతా ఎవరికోసమైతే ఎదురుచూస్తున్నారో వారు బయలుదేరారు. కాసేపట్లో సభా కార్యక్రమం ప్రారంభమౌతుంది. హీ ఈజ్ ఆన్ దవే షార్ట్‌లో హీ విల్‌భీ జాయినింగ్ విత్ హౌజ్. ప్లీజ్ కోవాపరేట్. ఆనాటి శుభారంభ సభావేదిక మరో కొద్దినిముషాల్లో ప్రారంభం కానుండగా.....

* * * * * *

రచయితగా పాఠకులకు అలరించానేగానీ, ఆలోచింపజేసే రచనలు చేయలేకపోయాను. నా జీవితం నుంచి నీవు నిష్క్రమించినా నాకన్నీటిని కలంలో నింపి కాగితంపై నిన్ను ఆవిష్కరిస్తాను. కాలంతో పాటు కదిలేకథగా నా రచనా సామర్థ్యాన్ని ఫణంగా పెట్టి అన్ని తరాల పాఠకులకు అందే అజరామర కావ్యంగా మలుస్తాను నీ జీవితాన్ని నీవు బ్రతికున్నప్పుడు నీ ఆలోచనలకు ఆవగింజంత విలువివ్వనినేను "నా మనసులోని భావాలకుకాగితంపై రూపాన్ని కూర్చమని ముచ్చటపడి నీవడిగినానిన్నో పూచికపుల్లగా, గడ్డిపరకగా తృణీకరించి అసహ్యించుకున్న నేను ఏం పోగొట్టుకున్నానో తెలుసుకున్నాను. నా కోసం నీవు నీ జీవితాన్ని త్యాగంచేశావు. కాదు. నేనే నిన్ను బలితీసుకున్నాను.

ఇందుమతీ!

దీపముండగానే ఇల్లు సర్దుకోవాలని నీతో పేచీపడిన నేను ఆ దీపాన్నే ఆర్పేసుకున్నాను. ఆనాడు మన అమ్మాయి పెళ్ళిచూపులప్పుడు మన కుటుంబ సభ్యులందరి ముందు నీ మరిది, ఆడపడుచుల సమక్షంలో నిన్ను అవహేళనచేసి మానసిక క్షోభకు గురిచేశాను. నా జీవితంలో నేను చేసిన ఆ పెద్ద తప్పుకు తగిన శిక్షే విధించాడు దేవుడు. నీవు లేని ఆ ఇంట్లో ఒంటరిగా వుండలేక అమ్మాయి ఇంటికెళ్ళాను.

కాస్త మనశ్శాంతిగా వుంటుందని, నా దినచర్యలో భాగంగా ఉదయం స్నానాదులు ముగించుకుని పూజామందిరమెటని అమ్మాయి నడిగాను. వాళ్ళు కొత్తగా కట్టుకున్న ఆ ఇంటికి మొదటిసారి వెళ్ళడంచేత. అమ్మాయి ఏమందో తెలుసా ఇందూ!

"నేను మీ అల్లుడుగారు మేము మా కోసం మాత్రమే కట్టుకున్న దేవతామందిరమిది. అతిథులెవరైనా వచ్చినప్పుడు కామన్‌గా కట్టిన పూజగది ఇటు. మీకు ఎక్కడ ఇష్టమనిపిస్తే" అని అమ్మాయి అన్నప్పుడు. ప్రత్యేకించి వారికోసం కట్టుకున్న ఆ ప్రత్యేక మందిరంలోకి అడుగిడి అవాక్కయ్యాను వారి ఇలవేల్పును చూసి. అక్కడ నీ పోట్రెయిట్ మనఃస్ఫూర్తిగా ఆరాదించే ఒక్కరున్నా చాలు ఆ మనిషి దన్యజీవి అనిపించినంది మొదటిసారి. ఆ ఒక్కరినే పోగొట్టుకుని విగత జీవినయ్యాయను నేను. ఆనాడు అమ్మాయి అన్న మాటలు నేనేం పోగొట్టుకున్నానో గుర్తుచేసి నాకు కనువిప్పు కలిగేలా చేశాయి.


"నాన్నా! మా జీవితంలో మరచిపోలేని రోజు మా పెళ్ళిచూపుల రోజు. మీ అల్లుడిగారి ఆలోచనలా సరళిని మార్చివేసిన రోజు. చిన్నప్పుడే తల్లిని దూరం చేసుకున్న మావారు అత్తగారిలో నేను వెతికే అమ్మ కనిపించిందంటారు ఇప్పటికీ, పెళ్ళివారు నన్ను చూడ్డానికి వస్తున్నారని, బాబాయ్ పిన్నివాళ్ళు, పెద్దత్తయ్య, చిన్నత్తయ్య, మావయ్యలు హాల్లో అంతా రాబోయేవారికోసం తర్జనభర్జనలు చేసుకుంటుండగా, పెళ్ళివారు రావడం, ఆ తర్వాత షరా మామూలే. వాళ్ళు నన్ను చూడ్డం మేమూ ఒకరినొకరం చూసుకోవడం మొత్తంమీద సంతృప్తి కరమైన వాతావరణంలో 'ఇక అసలు విషయానికి వద్దాం' అంటూ వాళ్ళు మనవాళ్ళు, వాళ్ళు అడిగిన ప్రతిదానికి బేరమాడి మొత్తంమీద మనవాళ్ళు ముందుగా నిర్ణయించుకున్న పట్టికకు అనుగుణంగానే తమవాదనలతో ముఖ్యంగా బాబాయ్, అత్తయ్యలు వాళ్ళని మాటలతో చిత్తుచేసి ఎలాగో చివరకు వాళ్ళని కన్విన్స్ చేశారు. వాళ్ళేంతక్కువ తినకపోయినా పట్టువిడుపులుండాలంటూ ఓ మెట్టు తామే దిగివచ్చారు.

ఇది మా వాక్చాతుర్యం వల్ల సాధ్యపడింది అని చెప్పకనే చెప్తాయి మనవాళ్ళ ముఖాలు. అది వారి ఔదార్యమో, నిజంగా మనవారినచ్చజెప్పే విధానమో చివరకు ఎలాగైతేనేం అంతా ఓకే అయి నిశ్చయతాంబూలానికి నిర్ణయం తీసుకోబోయే ముందు, అంతవరకూ మౌనంగా అన్నీ వింటున్న అమ్మ అన్న మాటలు ఒక్కసారి సంచలనం కలిగించాయి. "చూడండి! అన్నయ్యగారు మాకున్నది ఒక్కగానొక్క కూతురు. మాకున్నంతలో మిమ్మల్ని సంతృప్తిపరచాలనేదే మా కోరిక. మీ అబ్బాయికొన్ని ఒక్క నెలజీతంతో మీరు కావాలనుకుంటే సూట్ కొనగలరు. మీవల్ల కాదనిగాదుకదా మమ్మల్ని కుట్టించమంది. మాకు మర్యాదనివ్వండి అని అడిగినట్టు నాకు తోస్తుంది. అబ్బాయి వేసుకున్నప్పుడల్లా మా అత్తగారు కుట్టించిన సూట్ అని మిత్రులతో గర్వంగా చెప్తకు మురిసిపోవాలని అతని తలంపులలో మేమెప్పుడూ వుండాలని మీరు మాకిస్తున్న అవకాశంగా మేము భావిస్తూ ముచ్చటపడి అడిగిన హీరో హోండా. అది కొని పెట్టగల తాహత మాకు లేనప్పుడు మీరు కోరితే అది గొంతెమ్మ కోర్కే అవుతుందేమోగానీ, బాబు మనసుపడి అడిగిన ఆ కోరికను తీర్చలేకపోతే అది అతనికి జీవితకాలం గుర్తుంటుంది. ఎలాగూ పాతి


కవేలు పెట్టి స్కూటరు ఇవ్వడానికి సిద్ధపడ్డప్పుడు ఇంకో పది పదిహేను వేలు అతని సంతృప్తికోసం వెచ్చించడం మాకు తప్పనిసరని భావిస్తున్నాను. మాకు తాహతకు మించిన పనౌతుందన్న తాపత్రయంతో మావాళ్ళు, మిమ్మల్ని కాస్త నొప్పించియుండవచ్చు. క్షమించండి. అమ్మ అన్న ఆ మాటలకు మనవాళ్ళందరి ముఖ్యంగా బాబాయ్, అత్తయ్యల ముఖాలు కత్తివేటుకి కూడా నెత్తురుచుక్కలేనట్టు వాడిపోయాయి. మీ మౌనం వాళ్ళకి బలాన్నిచ్చినట్టుంది. పెళ్ళివారు వెళ్ళిపోయాక అమ్మని వాళ్ళు సూటిపోటి మాటలతో ఆ రోజంతా వేపుకుతిన్నారు. నన్నుచూసి కాస్త తగ్గినా వాళ్ళ మనసులోని అక్కసుని వెళ్ళగక్కుకున్నారు ఎలాగోలా. నా ఆలోచనంతా మీ గురించే ఆ రాత్రి నాన్నా! మీ మనసు మంచిదే. తోబుట్టువులంటే మీకున్న ఆప్యాయత ఆక్షేపనీయంకాదు, కూతురంటే మీకు ఇష్టమే. ఇక అమ్మ విషయంలోనే మీ ధోరణి. నా మనసును నొప్పించే ఈ విషయం మీ దృష్టికి ఎందుకు అందడంలేదో కారణం తెలియదు. చిన్నప్పటి నుంచి మీ దగ్గర నాచు చనువు తక్కువే. మీరు ఏరాత్రికో రావడం, మళ్ళీ ఉదయాన్నే వెళ్ళడం వల్ల నాకు కావలసినవన్నీ నానమ్మ, అమ్మే చూసేవారు, వారిదగ్గరి నాకు చనువు ఎక్కువ. కాస్త పెద్దయ్యాక, వయసుతోపాటు ఇంట్లో జరుగుతున్న కొన్ని సంఘటనలు వాటి తాలుకు చేదునిజాలు నా మనసును కలవరపడస్తా వచ్చాయి. నాన్నమ్మ చెప్పిందే వేదం మీకు. ఏనాడు ఇంటి పట్టున వుండని మీనరు దేన్నీ గమనించేవారుకాదు. రచయితగా మీరు ఎదుగుతుంటే అంతర్లీనంగా నాన్నమ్మలో ఒకరకమైన అహం కనిపించేది. తన అబ్బాయి ప్రగతికి ఏ తల్లైనా గర్వపడుతుంది కాదనను కానీ తన సంతానమే తెలివైన వాళ్ళని వాళ్ళతో నీకేమిటి పోలిక అంటూ అనవసరంగా అమ్మను వేదించేది. గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన అమ్మని ఏమిరానట్టు అత్తయ్యల ముందు చులకనగా మాట్లాడేది. అమ్మ మౌనమే ఆమె బలమై విజృంభించేది నాన్నమ్మ. ఆమె వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న అత్తయ్యలు బాబాయ్‌లు కూడా వంతపాడేవారు. నీకోసం తమ్ముడికోసమే బ్రతుకుతున్నానని ఎట్టి పరిస్థితుల్లోను కుటుంబ విషయంలో జోక్యం చేసుకోవద్దంది. అలా నాచే ప్రమాణం చేయించుకుంది. అందుకే తమ్ముడ్ని ఈ వాతావరణానికి దూరంగా రెసిడెన్షియల్ స్కూల్లో చేర్పించానంది. 'నాన్నా! అమ్మ మాటలని విశ్వసించు. తనింట్లోనే తనమీద హెరాస్‌మెంట్ జరుగుతుంది. అమ్మని రక్షించు' అని కూతురిచే చెప్పించుకునే దుస్థితిని ఏ తల్లీ కోరుకోరు. ఆ దృష్టితోనే ఆఖరిగా అమ్మ ఓమాటంది. ఎప్పుడో ఒకరోజు మీనాన్న నిజం తెలుసుకుని నన్ను ఆదరించకపోరు. ఆయన సమర్థతమీద నాకంత నమ్మకముంది. అలా ఆదరించి నన్ను న్నుగానే ప్రేమించిన రోజే నాకు ఆనందం" అని కానీ నాన్న! అమ్మ తన ఆ కోరిక తీరకుండానే తన నమ్మకం పండించుకోకుండానే అసువులు బాసింది" అమ్మాగుండెల్లో ఎన్నాళ్ళ నుంచో దాగిన ???? అగ్నిపర్వతం ఒక్కసారిగా బద్దలయినప్పుడు అప్పుడే అంకురించింది. ఇక వ్యర్థమనుకున్న ఈ జీవితానికి మరో పరమార్థం మిగిలి వుందని. అంతే గిరుక్కున వెనుదిరిగాను. ఇక అక్కడ క్షణం కూడా వుండలేక, అమ్మాయికి మొఖం చూపించలేక, మనసిప్పుడు తేలికగా వుంది ఇందూ రచయితగా నీ రుణం తీర్చుకునే మరొక్క అవకాశం భగవంతుడు నాకు ఆయాచితంగా ఇచ్చినందుకు. భర్త అనాదరణకు గురై చివరి వరకు పోరాడి వోడిన నీ జీవితం కనీసం నాలాంటి కొందరికి గుణపాఠం కావాలి. నీ నమ్మకాన్ని వమ్ముచేసిన నేను నీ ఆశయాన్ని వమ్ముకానివ్వను. నీ ఆశయాలకు అక్షరరూపం కల్పించి కాగితంపై అల్లుతాను, గతమంతా నాకళ్ళముందు ఒక్కొక్కటిగా కదులుతుంటే.

మొదటిసారి మన కలయిక అదో మధురానుభూతి. అప్పడప్పడే రచయితగా ఎదుగుతున్న నాకు, నా శైలిని ప్రశంసిస్తూ, వెయిట్ వున్న సబ్జెక్ట్స్ ఎన్నుకోమని మతిమెత్తని విమర్శ చేస్తూ నీవు వ్రాసిన లెటరు నాలో కొత్త ఉత్సాహాన్ని కలిగించింది. ముఖస్తుతికోసం కాకుండా ముద్దుగా మందలించినప్పుడే నా మనస్సులో నీపై ప్రత్యేక భావం ఏర్పడింది. ఆ తర్వాత నేనిచ్చిన ఫజిల్‌ను చేధించి నన్ను కలవడానికి మొదటిసారి థియేటర్‌కు చేరుకున్నప్పుడు నీ కుశాగ్రబుద్ధికి ముగ్ధుడనయ్యాను. ఓవెల్స్ లేకుండా మూడు ఇంగ్లీష్ అక్షరాలు కలిపి ఒక అర్థవంతమైన పదం ఇక్కడ మరో క్లూ నామ వాచకం (NOUN) వచ్చాక లైన్‌లో లంకెవేస్తే నగరం నడిబొడ్డున ఒక థియేటరౌతుంది. సా. 6 గంటలకు అక్కడకు చేరుకుంటే అక్కడ మనం కలవచ్చు. అంతే! ఖచ్చితంగా అనుకున్నటైంలో నీవు స్కైలైన్ థియేటర్‌కు రావడం తరచూ నీ రచనల్లో దర్శనమిచ్చే ఇలాంటి జిమిక్స్ మానమని, కాళిదాసు మేఘసందేశంలా, విశ్వనాథ వేయిపడగలు, రవీంద్రుని గీతాంజలి, శరత్ దేవదాసు, చాలా మ్యూజింగ్స్, శ్రీశ్రీ మహాప్రస్థానం, సినారె విశ్వంభరలాగా జనంతో నిలిచిపోయే, ఒక్క కళాఖండమయినా చాలు, రచయిత జన్మ ధన్యమయినట్లేనని, అందుకు ప్రయత్నించమని, ఆనాటి నా ఆలోచనలకు చిన్నంగా సరదాగా సినిమా చూద్దామనుకున్న నన్ను సాహిత్యంవైపు మళ్ళించి తనువులు తాకితే చాలు అన్న నా అల్పమైన ఆలోచనకు సిగ్గుపడేలా ఏకంగా నా మనసునే తాకి నీవు నా అర్థాంగివైనతీరు.

మన ప్రేమ వివాహానికి అమ్మకూడా కాస్త



బెట్టుచేసినా చివరకు ఒప్పుకోవడం అలా అలా ప్రారంభించిన మన జీవన ప్రయాణం ఆదిలోనే అసంతృప్తితో ప్రారంభమయిందని, అది నావల్లనేనని, ఈ అసంతృప్తి కొన్నాళ్ళేనని అనుకున్నాను. నావాళ్ళే నన్ను మోసం చేస్తున్నారని, నిన్ను వేధిస్తున్నారని, నా డబ్బును, కీర్తిని వాడుకుని నాకే ద్రోహం తలపెడతారని ఊహించలేకపోయాను. ఇందూ! మన తొలిరోజులు జ్ఞాపకం వచ్చినప్పుడల్లా నా మనస్సు కకావికలమౌతుంది. నీ మానాన నిన్నుదిలేని రచయితగా పేరుకోసం కొన్నాళ్ళు, దాన్ని నిలుపుకోవడానికని, కొన్నాళ్ళు, వచ్చిన అవకాశాన్ని జారవిడుచుకోకూడదని, ఆఖరికి నిన్నే పోగొట్టుకున్నాను. నీవు ఊహించుకున్న ఆశాసౌధాన్ని కూకటివేళ్ళతో కూల్చేశాను. మీ ఆరోగ్యం, ఆనందం నాకు ముఖ్యం. వేళకి భోజనం కూడా లేకుండా ఎందుకంటే ఈ సంపాదన అని నీవన్నప్పుడు నీ సౌభాగ్యానికి నీవిచ్చిన విలువని అర్థంచేసుకోలేకపోయినా దౌర్భాగ్యున్ని నేను. నీవు నా నుంచి కాసింత అనురాగాన్ని, ఆత్మీయతను ఆశించినప్పుడు, దానికి నీకు మాతృత్వాన్ని ప్రసాదించడమే కొలమానమన్నట్లు అవివేకంగా మాట్లాడి నీ గుండెను తూట్లు పొడిచిన నాకు ఈ జన్మకు నిష్కృతి లేదు ఇందుమతీ! కొడుకులతో పాటు కూతురికి కూడా ఆస్తిలో వాటావున్నప్పుడు అల్లుడుగార్ని సంతోషపెట్టడం కోసం ఆ మాత్రం మనకున్నదాంట్లో ఖర్చుచేయడంలో అంత బాధేమిటో మనవాళ్ళకి అని నీవన్నప్పుడు మాహానా!




ఒక ఆడది అయి వుండి కూడా వరకట్నాన్ని సపోర్ట్ చేస్తూ ఎలా మాట్లాడుతుందో! అని నా తోబుట్టువులు నాముందు కామెంట్ చేసినప్పుడు, ఆవేశంతో నిన్ను నోరుమూసుకోమన్నానేగానీ నీవు నోరుమూసుకుంటే కొన్ని నిజాలు నీతోపాటు సమాధి అవుతున్నాయి. కోడలి విషయంలో ఒకనీతి, కూతురి విషయంలో ఒకనీతి తల్లిదండ్రులుగా, అత్తమామలుగా ఇలా ద్వంద ప్రమాణాలు పాటించే వికృత సంస్కృతిని నీవు వేలెత్తిచూపితే, నీలాపనిందలు నీపై, అక్షరాలను అందంగా వెన్నెల్లో ఆడపిల్లలా పరుగులు తీయిస్తూ ఆచరణ సాధ్యం కాని అతిశయోక్తులతో, పేజీలకు పేజీలు నింపుతూ వచ్చిననాపై ప్రశంసలు, అయినా నీవు దేన్ని పట్టించుకోకుండా నీ మార్గాన్నే ఆదర్శం అక్షరాల్లోనేకాదు ఆ మనిషి అంతర్యంలో కూడా వుండాలని వాటిని తను పాటించినప్పుడే ఆ రాతకు విలువని మార్గనిర్దేశనం చేస్తూనేవచ్చావు చివరివరకూ నీలా నన్నెవరూ నిలదీయలేదు. ఆ ప్రశంలను, పొగడ్తలను చూసి మురిసిపోయాను, నిన్ను మరచిపోయాను వాపును చూసి బలుపనుకున్నాను. ఒకవేళ అది నిజమయిన బలుపయినా అది రచయితకు శోభనివ్వదని నిగూఢార్థంలో నీవు చెప్పినప్పుడు పురుషాహంకారంతో ఈర్ష్య, నా మొండివాదాన్ని ఖండించుకోలేకపోయాను. నేడు స్త్రీవాదం అంటూ కొందరు రచయితలు (ఆడ మగ) రాస్తున్న దానికన్నా నీవాదంతో నిజముందని, స్త్రీ సౌజన్యమూర్తి, కారుణ్యమూర్తి, మమతాను రాగాలు పంచిపెట్టే మాతృమూర్తి వేయేల, పూజ్యేషుమాతా, కార్యేషు దాసి, కరుణేషు మంత్రి, శయనేషు రంభ అని తమని ఆనందంలో ముంచడానికే ఈ రాతలని, పరవసింపజేసే ఈ రాతలు తను పరవశాన్ని పెంచాయని అందరికీ సేవలు అందించేది ఆడే అనే ఆదేశామేకాక భవిష్యతరాలకు ఉపదేశమే ఆ ప్రశంసల పరమార్థమని ఈ యదార్థాన్ని విశ్లేషిస్తూ నా మనస్సులోని భావాలకు అక్షరరూపమయిందని నా అర్ధాంగివైన నీవు నన్ను అర్థించినా ఆ ఒక్క కోరికను కూడా తీర్చలేకపోయాను. నీవు ప్రత్యక్షంగా చేయని పనిని, అంతర్లీనంగా నీలోనే సమాధి అయిన నీ ఆలోచనలకు అలిగి ప్రాణప్రతిష్ఠ చేసి పదిమందికి పంచుతాను. మన పెళ్ళయిన పాతిక సంవత్సరాల తర్వాత నీవు మనసుపడి అడిగిన కోరికను తీర్చుతున్నాను. తిరిగిరాని తీరాలకు నీవు తరలివెళ్ళినా నీపై నా ప్రేమ చెరగిపోలేదని కాలం సాక్షిగా ఈ కథను నీకు కానుకగా అర్పిస్తున్నాను.

ప్రేమ మొగ్గేసిన నాడి వాల్సిన కానుకని–ఓ నా రాలిపోయిన పువ్వా! నువ్వు వాడిపోకూడదని, నా అక్షరాల్లో నిక్షిప్తంచేసి అందిస్తున్నాను నీకు ఈ 'ప్రేమకానుక'.

* * * * * *

సాయంత్రం 6.35 నిముషాలు.

రవీంద్రభారతి వి.ఐ.పి. ఎంట్రెన్స్ దగ్గర చిన్నపాటి కలకలం. క్షణం క్రితం వున్న నిశబ్దాన్ని భగ్నంచేస్తూ హాల్లోని జనమంతా అటే దృష్టి సారించారు. మరో కొన్ని క్షణాలు ప్రేక్షకుల సహనాన్ని పరీక్షిస్తూ, విధి పరిహాసమని వారికేం తెలుసు.

'ప్రేమకానుక' సృష్టికర్త మన అభిమాన రచయిత ఇంకా సేపట్లో మనందరి సమక్షంలో సన్మానాన్ని అందుకోవాల్సిన వ్యక్తి. ఇక ఇక్కడికిరాలేరు. ఇక మనకి లేరు వారు బయలుదేరి వస్తుంటే తీవ్ర ఆక్సిడెంట్‌కి లోనై అక్కడికక్కడే మృతిచెందారని తెలపడానికి విచారిస్తున్నాము. వారి అభినందనసభ సంతాప సభగా తీర్మానిస్తూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిముషాల పాటు శ్రద్ధాంజలి ఘటిద్దాం అని అనౌన్సరు ప్రకటించేవరకు ఎవ్వరికి ఏమీ అర్థంకాలేదు.

బయలుదేరేముందు ఆ రచయిత అనుకుంది కూడా అదే నాకెందుకు సన్మానమో అర్థంకావడం లేదని అది అందుకనే అర్హత తనకి లేదని–

ఆమె మరణానికి ప్రధాన కారణం తను, మనసులోని వ్యథను తను రాస్తే, కేవలం 'కథ' అనుకుని రచయితకు సన్మానం ఏర్పాటు చేశారు కాబోలు.

పాపం వారికేం తెలుసు! ప్రేమకానుకతో ఈ నిజమైన కథకు నేనిచ్చిన ముగింపు.

తప్పుచేసిన వాడికి తప్పదు శిక్ష అంటూ విధాత విధించే ఆ శిక్షతో తన కథ కాసేపట్లో ముగియనుందని పాపం ఆయనకేం తెలుసు! ఈ కథకి ముందే వ్రాయబడ్డ ముగింపు.